ఆటపాటలు విద్యార్థుల్లో ప్రతిభాపాటవాలకు దోహదం

మండల విద్యాశాఖ అధికారి వివిఎస్.బ్రహ్మచారి

చాట్రాయి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆటపాటలు నిర్వహించడం విద్యార్థులలోని ప్రతిభా పాటవాలను వెలికి తీయడానికి దోహదపడతాయని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా మెరుగుపడుతుందని మండల విద్యాశాఖ అధికారి వివిఎస్.బ్రహ్మచారి తెలిపారు. మండలంలోని మర్లపాలెం గ్రామంలోని ఎంపిపి మెయిన్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ఉప సర్పంచి వెల్లి రాజారావు మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు విద్యను అందించడమే కాకుండా విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధికి దోహదపడే ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. పాఠశాల విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి చిట్టిబాబు, గ్రామ పెద్దలు, ఎస్.సత్యనారాయణ, పాఠశాల హెచ్‌ఎం ఆర్.అనూష, ఉపాధ్యాయులు కె.నాగరాణి పాల్గొన్నారు.

ఎంపిపి ఎన్నికల్లో కూటమి 'జులుం'..!

వైసిపికి ఎంపిటిసిల బలం ఉండటంతో కుయుక్తులకు తెర

ఎత్తులు పారకపోవడంతో ఎంపిపి ఎన్నికలు వాయిదా పడేలా వ్యూహం

అనుకున్నట్లుగానే అత్తిలి, యలమంచిలి ఎంపిపిల ఎన్నిక వాయిదా

ఘర్షణల నడుమే కైకలూరు వైస్ ఎంపిపి పదవి కూటమి కైవసం

అత్తిలిలో మోహరించిన పోలీసులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రజాస్వామ్యయుతంగా జరగాల్సిన మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల్లో కూటమి నేతలు వ్యవహరించిన తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తున్నాయి. బలం లేకపోయినా ఎంపిపి, వైస్ ఎంపిపి పదవులు దక్కించుకునేందుకు కూటమి నేతలు పన్నిన కుయుక్తులు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా అప్పట్లో వైసిపి వ్యవహార శైలిపై తీవ్ర విమర్శలు గుప్పించిన టిడిపి, జనసేన నేతలు ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అదేవిధంగా వ్యవహరించడం ఏమిటని అంతా ప్రశ్నిస్తున్నారు. అప్పుడు వైసిపి ప్రభుత్వానికి, ఇప్పుడు కూటమి ప్రభుత్వానికి తేడా ఏమిటనే చర్చ సాగుతోంది. ఖాళీ అయిన అత్తిలి, యలమంచిలి ఎంపిపి పదవులకు, కైకలూరు, ఏలూరు రూరల్ వైస్ ఎంపిపి పదవుల ఎన్నికలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. దాని ప్రకారం ఈ నెల 27న ఎన్నిక ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. తొలిరోజు అన్నిచోట్లా ఎన్నిక వాయిదా పడింది. రెండోరోజు 28వ తేదీన సైతం అత్తిలి, యలమంచిలి ఎంపిపిల ఎన్నిక మాత్రం జరగలేదు. ఘర్షణల నడుమ కైకలూరు వైస్ ఎంపిపి పదవిని కూటమి దక్కించుకుంది. ఏలూరు వైస్ ఎంపిపి పదవిసైతం కూటమి ఖాతాలో పడింది.

బలం లేకపోయినా పదవుల కోసం యత్నం

అత్తిలి మండలపరిషత్‌లో మొత్తం 20 ఎంపిటిసి స్థానాలకుగాను 16 వైసిపి, రెండు చోట్ల టిడిపి, రెండు చోట్ల జనసేన గెలిచాయి. కొంతకాలం క్రితం పరిణామాలతో టిడిపి, జనసేన బలం ఆరుకు చేరింది. వైసిపికి బలం 13కు తగ్గింది. వైసిపి ఎంపిటిసిలను ఎంతో ప్రలోభపెట్టినా లొంగకపోయేసరికి టిడిపి నేతలు ఎంపిపి ఎన్నిక జరగకుండా కుయుక్తులు పన్నినట్లు తెలుస్తోంది. అత్తిలి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏకంగా వందమందికిపైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. వైసిపి ఎంపిటిసిలు మండల పరిషత్ కార్యాలయానికి రాకుండా ఎక్కడికక్కడే టిడిపి నేతలు మోహరించారు. దీంతో 27వ తేదీ జరగాల్సిన ఎన్నిక 28వ తేదీకి వాయిదా పడింది. పరిస్థితిలో ఎటువంటి మార్పు లేకపోవడంతో మరోసారి ఎన్నిక వాయిదా పడింది. యలమంచిలి ఎంపిపి ఎన్నికలోనూ ఇదే తరహాలో హైడ్రామా సాగింది. ఈ మండలంలో మొత్తం 17 మంది ఎంపిటిసిలకుగాను 13 మంది వైసిపి తరపున, టిడిపి నుంచి ముగ్గురు, జనసేన నుంచి ఒకరు గెలుపొందారు. తర్వాత వైసిపి ఎంపిటిసి ఒకరు టిడిపిలోకి చేరారు. అయినప్పటికీ వైసిపికి ఇంకా 12 మంది ఎంపిటిసిలు ఉన్నారు. వైసిపి ఎంపిటిసిలను దారికి తెచ్చుకునేందుకు అక్కడి టిడిపి నేతలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని తెలిసింది. దీంతో మండల పరిషత్ కార్యాలయం వద్ద టిడిపి నేతలతో ఘర్షణ వాతావరణం సృష్టించి ఎన్నికలు వాయిదా పడేలా చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండోరోజు శుక్రవారం ఎన్నికల అధికారి ఎం.శ్రీనివాసరావు అస్వస్థతకు గురవ్వడం టిడిపి నేతల వ్యూహంలో భాగమే అనే చర్చ సాగుతోంది.

కైకలూరులోనూ 22 మంది ఎంటిసిలకు ఒక్కచోటే టిడిపి గెలిచింది. మిగిలిన వారంతా వైసిపి ఎంపిటిసిలే. ఇక్కడ వైస్ ఎంపిపి మరణించడంతో ఎన్నిక వచ్చింది. కూటమి అధికారంలోకొచ్చాక వైసిపి నుంచి గెలిచిన సగం మంది ఎంపిటిసిలు కూటమిలో చేరిపోయారు. దీంతో బలం సమానంగా మారింది. వైసిపి నుంచి ఒక ఎంపిటిసిని ఎన్నికకు రాకుండా కూటమి నేతలు అడ్డుకోవడంతో ఘర్షణలు జరిగి 27వతేదీ ఎన్నిక వాయిదా పడింది. శుక్రవారం ఘర్షణల నడుమే వైస్ ఎంపిపి పదవిని కూటమి దక్కించుకుంది. వైస్ ఎంపిపిగా జనసేనకు చెందిన మంగిన రామకృష్ణ ఎన్నికయ్యారు.

జర్నలిస్టులపై దాడులు

ఎంపిపి, వైస్ ఎంపిపి ఎన్నికల సందర్భంగా కూటమి నేతలు జర్నలిస్టులపై దాడులు చేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అత్తిలిలో మండల పరిషత్ కార్యాలయం వద్ద సాక్షి కెమెరామెన్‌ను తోసేయడంతో కెమెరా ధ్వంసమైంది. కైకలూరులో భవ్య న్యూస్ రిపోర్టర్‌పై కూటమి నేతలు దాడ చేయడంతో అతనికి తీవ్ర గాయాలై ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జర్నలిస్టులపై దాడులను జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి.

ఏలూరు వైస్ ఎంపిపిగా గండికోట నాగరాజు

ప్రజాశక్తి - దెందులూరు

ఏలూరు మండల వైస్ ఎంపిపిగా మాదేపల్లి ఎంపిటిసి సభ్యులు గండికోట నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి, డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి సమక్షంలో ఎన్నిక నిర్వహించారు. తొలుత ఏలూరు ఎంపిపి పెన్మెత్స శ్రీనివాసరాజు నాగరాజు పేరును ప్రతిపాదించగా, మాదేపల్లి మరో ఎంపిటిసి నాగమణి బలపరిచారు. ఆరుగురు సభ్యులు హాజరవ్వగా, పోటీలో నాగరాజు ఒక్కరే ఉండటంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. కార్యక్రమంలో ఏలూరు ఎంపిడిఒ శ్రీలత పాల్గొన్నారు.



ఏలూరు వైస్ ఎంపిపిగా ఎన్నికైన నాగరాజుతో నేతలు

ఉంగుటూరు ఎఎంసి ఛైర్‌పర్సన్‌గా జ్యోతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు ఎఎంసి ఛైర్‌పర్సన్‌గా జనసేన నేత సూరత్తుల అయ్యప్ప భార్య కారేటి జ్యోతి నియమితులయ్యారు. ఎఎంసి ఛైర్‌పర్సన్ అభ్యర్థులుగా టిడిపి నుంచి బిసి మహిళ, జనసేన నుంచి బిసి మహిళ పేర్లను ఎంఎల్‌ఎ ధర్మరాజు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. అయితే కూటమి పొత్తులో భాగంగా ఎఎంసి పదవి జనసేనకు కేటాయించడంతో కారేటి జ్యోతి పేరు ఖరారైంది.

పిన్న వయస్సులో ఛైర్‌పర్సన్ పదవి

ఉంగుటూరు మండలం నాచుగుంట పంచాయతీ కొత్తగూడేనికి చెందిన కారేటి జ్యోతి బికాం కంప్యూటర్ విద్య అభ్యసించారు. ఆమె వయసు 22 ఏళ్లు. అతి పిన్న వయస్సులో రాజకీయంగా ఎంతో ప్రాముఖ్యత ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా జ్యోతి ఎంపిక కావడం పట్ల జనసేన శ్రేణులు, ఆమె స్వగ్రామ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఏలూరు ఎఎంసి ఛైర్మన్‌గా మామిళ్లపల్లి పార్థసారథి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా మామిళ్ళపల్లి పార్థసారథి నియమితులయ్యారు. 2009 నుంచి తెలుగుదేశం పార్టీనే అంటిపెట్టుకుని పని చేయడంతోపాటు బడేటి కుటుంబంతో ఎనలేని అనుబంధం ఈయనకు ఉంది. 2014 ఎన్నికల్లో ఏలూరు ఎంఎల్‌ఎగా గెలుపొందిన బడేటి బుజ్జి హయాంలోనూ మామిళ్లపల్లి పార్థసారథికి ఎఎంసి ఛైర్మన్ పదవి కేటాయిస్తారని ప్రచారం సాగిన సామాజిక సమీకరణల నేపథ్యంలో అది నెరవేరలేదు. 2024 ఎన్నికల్లో బడేటి కుటుంబం నుంచి బడేటి చంటి ఎంఎల్‌ఎగా గెలిచారు. టిడిపి విజయంలో కీలక పాత్ర పోషించిన మామిళ్లపల్లి పార్థసారథికి ఎఎంసి ఛైర్మన్ పదవి వచ్చేలా ఎంఎల్‌ఎ చంటి కృషి చేశారు. ఏలూరు నగరంలో పురుగులమందులు, ఎరువుల విక్రయానికి మామిళ్లపల్లి కుటుంబం కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది. పార్థసారథి కొన్ని సంవత్సరాలుగా ఎరువుల వ్యాపారం చేస్తూ రైతులకు నేస్తంగా ఉన్నారు.

దెందులూరు ఎఎంసి ఛైర్‌పర్సన్‌గా గారపాటి రామసీత

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా గారపాటి రామసీత నియమితులయ్యారు. ఆమె గతంలో పెదపాడు జెడ్‌పిటిసిగా పని చేశారు. టిడిపి నేతగా గుర్తింపు పొందిన ఆమెకు ఎఎంసి ఛైర్‌పర్సన్ పదవి వరించింది. దీనిపై టిడిపి శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశాయి.

విద్యుత్ భారాలు ఉపసంహరించాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించాలని, సెకి ఒప్పందం రద్దు చేయాలని, టైమ్ ఆఫ్ డే విధానం రద్దు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక విద్యుత్ ఛార్జీలు తగ్గించకపోగా ఎడపెడా పెంచుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి అనుగుణంగా పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు ఎస్‌కె.మాబుసుభాని, వి.గోపీ, వినోద్, టి.రాంబాబు, టి.ఆనంద్, కె.ఏసు, ఎం.నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో నినదిస్తున్న నేతలు

కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

కొల్లేరును 3వ కాంటూరుకు కుదించి ప్రజల ఉపాధిని కాపాడాలి - సిపిఎం కొల్లేరు ప్రజా చైతన్య యాత్రలో జిల్లా కార్యదర్శి ఎ.రవి

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు

కొల్లేరు ఆపరేషన్ కొన్ని గ్రామాల్లో పేదలు, సొసైటీలు, డి.ఫారం పట్టాదారుల ఉపాధిని దెబ్బతీసిందని, జిరాయతీ రైతులు దారుణంగా నష్టపోయారని, ముంపు, కాలుష్యం సమస్య పరిష్కారం కాలేదని, కొల్లేరు పేదల జీవనోపాధికి ఇతర ప్రాంతాలు, రాష్ట్రాలకు వలసలు పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లేరు ప్రజల సమస్యలపై సిపిఎం ప్రజా చైతన్య యాత్ర శుక్రవారం రెండో రోజు మండలంలోని శ్రీపర్రు, మహేశ్వరపురం, కలకుర్రు గ్రామాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కొల్లేరు సరస్సును 5 నుండి 3వ కాంటూరుకు కుదించాలని, కాలుష్యం అరికట్టాలని అన్నారు. నష్టపోయిన పేదలు, సొసైటీలు, డి.ఫారం పట్టాదారులకు కుటుంబానికి రెండెకరాల భూమి ఇవ్వాలన్నారు. ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలన్నారు. నష్టపోయిన జిరాయతీ, సన్న, చిన్నకారు రైతులకు భూమికి విలువైన ప్రత్యామ్నాయ భూమి ఇవ్వాలని, బెడ్ (లోతట్టు) గ్రామాల్లో రోడ్లు, వంతెనలు, చెరువులు, ఇతర ప్రజావసర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఛానలైజేషన్ అమలు చేసి కొల్లేరు పైభూములు, బెడ్, బెల్ట్ గ్రామాలను ముంపు బెడద నుండి కాపాడాలన్నారు. రెగ్యులేటర్ల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో కొల్లేరు పరిధి పెంచి ప్రజలను ఇబ్బందులకు గురి చేసే చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, నాయకులు ఎస్.సత్యనారాయణ, కొల్లేరు ప్రజలు పాల్గొన్నారు.

మండవల్లి: కొల్లేరు ప్రజల సమస్యలపై గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. మండలంలోని పెనుమాకలంక, కొవ్వాడలంక, దేవి చింతపాడు, దెయ్యంపాడు తదితర గ్రామాల్లో నాయకులు పర్యటించారు. కొల్లేరు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ తదితరులు మాట్లాడారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామన్న పాలకుల మాటలు నీటి మూటలుగా మిగిలిపోయాయన్నారు. 2006లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో ఐదో కాంటూరు లోపల ఉన్న వేలాది ఎకరాల చెరువులన్నింటినీ ధ్వంసం చేసి లక్షలాది మంది కొల్లేరు ప్రజల జీవనాన్ని నాశనం చేశారన్నారు. ఐదో కాంటూరు పరిధిలో 77,138 ఎకరాల చెరువులు ధ్వంసం పేరుతో 86 వేల ఎకరాలకుపైగా చెరువులు ధ్వంసం చేశారన్నారు. 7500 ఎకరాల సొసైటీ చెరువులు, 13 వేల ఎకరాల్లో జిరాయతీ భూముల చెరువులను ధ్వంసం చేశారన్నారు. దీంతో కొల్లేరు ప్రజల పరిస్థితి గట్టునపడ్డ చేపల్లా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కొల్లేరులోని వేలాది మంది ప్రజలు పొట్ట నింపుకునేందుకు సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లారని, వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 120 జిఒ ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణాన్ని పరిరక్షిస్తామనే పేరుతో కొల్లేరును ధ్వంసం చేశాయన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, ఉపాధి కల్పన లేదన్నారు. కొల్లేరు ప్రజల ఉపాధిని నష్టం కలిగించేలా పర్యావరణం పేరుతో కొంతమంది సుప్రీంకోర్టుకు వెళ్లగా కొల్లేరు ప్రజల సాగులో ఉన్న 15 వేల ఎకరాలు చెరువులు ధ్వంసం చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వగా అధికారులు గట్లు ధ్వంసం చేశారన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు కేసులో ఇంప్లీడ్ కాకపోవడంతో సుప్రీంకోర్టు ఏకపక్షంగా తీర్పునిచ్చిందన్నారు. కొల్లేరు ఆపరేషన్ సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొల్లేరు ప్రజలకు జీవనోపాధి కల్పించాలని, 146 సొసైటీలు పునరుద్ధరించాలని, 13 వేల ఎకరాలు జిరాయితీ భూమి హక్కుదార్లకు అప్పగించాలని కోరారు. సుప్రీంకోర్టు గ్రీన్ ట్రిబ్యునల్ కేసులో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇంప్లీడ్ పిటీషన్ వేయాలన్నారు. కొల్లేరులోని వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని కోరారు. పెనుమాకలంక గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిని తారు రోడ్డుగా వెంటనే నిర్మించాలన్నారు. వరద ముంపునకు గురికాకుండా కరకట్ట నిర్మించి గ్రామానికి రక్షణ కల్పించాలన్నారు. ఇతర కొల్లేరు గ్రామాలకు రోడ్లు, విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు.

కొల్లేరును పరిశీలిస్తున్న నేతలు

ఆటో డ్రైవర్ల జీవనోపాధిని కాపాడాలి

ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి

ప్రచార యాత్రలో మాట్లాడుతున్న గోపి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ర్యాపిడో, ఉబర్, ఓలా సంస్థలను వ్యతిరేకించి ఆటో డ్రైవర్ల జీవనోపాధిని కాపాడాలని ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్(సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి పిలుపునిచ్చారు. రాపిడో, ఉబర్, ఓలా వంటి సంస్థలను వ్యతిరేకించాలని కోరుతూ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద జరిగిన ప్రచార యాత్రలో ఆయన మాట్లాడుతూ ఏలూరు నగరంలో అనేక దశాబ్దాలుగా ప్రజలకు సురక్షిత ప్రయాణ సేవలను అందిస్తూ ఆటో డ్రైవర్లు జీవనోపాధి పొందుతున్నారని, సరళీకరణ ఆర్థిక విధానాలలో భాగంగా అమెరికా సామ్రాజ్యవాద కార్పొరేట్ కంపెనీలు ఎంతో వైవిధ్యం కలిగిన భారతీయ జీవన ఉపాధి రంగాలపై దోపిడీ చేస్తున్నాయని, దీనివల్ల స్థానిక ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సంస్థలు ఎటువంటి పెట్టుబడి లేకుండా ఒక కాల్ సెంటర్‌ని ఏర్పాటు చేసుకుని కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వదేశీ నినాదాన్ని ప్రచారం చేస్తూ, విదేశీ బహుళ జాతి కంపెనీలకు అనుమతులు ఇవ్వడం సమంజసం కాదని అన్నారు. ఆరు శాతానికి మించి కమిషన్లు వసూలు చేయకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ 25 నుంచి 30 శాతం కమిషన్ వసూలు చేస్తున్న రేపిడో, ఉబర్, ఓలా సంస్థలపై కర్ణాటక తరహాలో కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో స్టాండ్లలో ఒక క్రమ పద్ధతిని ఏర్పాటు చేసుకుని సీరియల్ పద్ధతిలో ఆటోలను నడుపుతూ ఆటో డ్రైవర్లు జీవనం సాగిస్తున్నారని, అసలే కిరాయిలు లేక అవస్థలు పడుతున్న సమయంలో రాపిడో వంటి సంస్థల వాహనాలు స్థానిక ఆటో కార్మికుల కిరాయిలను తరలించుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రవాణా రంగ పరిశ్రమలో పనిచేస్తున్న ఆటో డ్రైవర్లకు ఎటువంటి రక్షణ చట్టాలు లేవని, కోట్లాది రూపాయల ఆదాయాన్ని సమకూరుస్తున్న ఆటో డ్రైవర్లకు సంక్షేమ చట్టాన్ని చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రచార యాత్రకు నగర కమిటీ అధ్యక్షులు అడ్డాల రాజు(నాని), స్థానిక ఆటో యూనియన్ల నాయకులు కె.నారాయణ, శంకర్, రాజు నాయకత్వం వహించగా ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేద మహిళల స్వయం ఉపాధికి టైలరింగ్‌లో శిక్షణ

శిక్షణాంతరం ఉచితంగా కుట్టుమిషన్లు అందజేత

ప్రారంభ కార్యక్రమంలో మంత్రి కొలుసు పార్థసారథి



మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మహిళల స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ, టైలరింగ్ శిక్షణ అందిస్తోందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. శుక్రవారం నూజివీడు విక్టోరియా టౌన్ హాలు, తుక్కులూరులోను బిసి కార్పొరేషన్, కాపు కార్పొరేషన్ ద్వారా కుట్టుమిషన్ల ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ పథకం(ఎపి ఫ్రీ స్వీయింగ్ మిషన్ స్కీం-2025) ప్రారంభించిందన్నారు. ఈ పథకం ద్వారా మహిళలకు 90 రోజులపాటు ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి 75 శాతం హాజరుతో శిక్షణ పొందిన వారికి నిబంధనల మేరకు కుట్టుమిషన్లు కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. తొలి విడతగా జిల్లాలో 4,589 కుట్టుమిషన్లు ఉచితంగా అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారని, అందులో భాగంగా నూజివీడు నియోజకవర్గంలో 700 కుట్టుమిషన్లు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరేపల్లి శిరీష, బిసి కార్పొరేషన్ ఇడి ఎన్.పుష్పలత, మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి, ఎంపిడిఒ చెన్నా రాఘవేంద్రనాద్, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

డబ్బు, బంగారం కోసం వృద్ధురాలి హత్య

పోలీసుల అదుపులో నిందితుడు

మృతురాలు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

గుర్తు తెలియని వ్యక్తులు 65 ఏళ్ల వృద్ధురాలిపై పెట్రోల్ పోసి నిప్పంటించి హతమార్చిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. మర్డర్‌తో ఒక్కసారిగా ఏలూరు నగరం ఉలిక్కిపడింది. వివరాల్లోకెళితే.. ఏలూరు నగరంలోని ఒకటో పట్టణ పరిధిలో వెన్నవల్ల వారి పేటలో నివాసం ఉంటున్న సేనాపతి రమణమ్మ(65) స్థానికంగా వడ్డీ వ్యాపారం చేస్తూ జీవనాన్ని సాగిస్తుంది. ఈక్రమంలో శుక్రవారం తెల్లవారుజామున సమయంలో ఆమె ఇంటి నుంచి పొగలు రావడం గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులకు వృద్ధురాలు కాలిన స్థితిలో పడి ఉండడం గమనించారు. సమాచారం అందుకున్న జిల్లా ఇన్‌ఛార్జి ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. జిల్లా అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు నేతృత్వంలో ఈ కేసు విచారణ కొనసాగుతుందని ఆయన అన్నారు. ప్రాథమిక విచారణలో భాగంగా బంధువుల వద్ద నుంచి వివరాలు సేకరించామని తెలియజేశారు. ఈ హత్య ఘటనలో మృతురాలు ఒంటి మీద ఉండవలసిన పన్నెండు కాసుల బంగారు ఆభరణాలు, రూ.25 వేల నగదు అపహరణకు గురైనట్లు బంధువులు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై ఏలూరు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. స్థానికంగా పేటలో ఉన్న పలువురిని పోలీసులు విచారించారు. ఆమె చీటీలు వ్యాపారం చేస్తూ ఉండడంతో ఆమె వద్ద చీటీలు వేసిన అందర్నీ కూడా పోలీసులు విచారించారు. పోలీసుల అదుపులో ఏలూరు సత్యనారాయణపేటకు చెందిన సేనాపతి దుర్గాప్రసాద్ అనే యువకుడు ఉన్నాడు. బంగారం, నగదు కోసమే అతను మృతురాలిని హత్య చేసి, ఆపై ఆమె ఒంటిపై ఉన్న బంగారం, ఇంట్లో ఉన్న నగదును తీసుకుని పరారైనట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. అయితే ఇతనికి ఎవరైనా సహకరించారా? ఒక్కడే ఈ దారుణానికి ఒడిగట్టాడా అన్న కోణంలో పోలీసులు ఇంకా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ కేసులో అత్యంత కీలకమైన ఆధారాలను గంటలోనే ఏలూరు పోలీసులు సేకరించి నిందితుడిని తీసుకోవడం గమనార్హం. చెడు వ్యసనాలకు బానిసైనా దుర్గాప్రసాద్ సొమ్ముల కోసమే వరుసకు అమ్మమ్మ అయిన మృతురాలని హతమార్చినట్లు తెలుస్తుంది.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

ఇఫ్తార్ విందులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సర్వ మానవాళి సుఖ సంతోషాలు రంజాన్ ప్రార్థనల ముఖ్యోద్దేశ్యం అని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక గిరిజన భవన్‌లో మైనారిటీస్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం జరిగిన 'ఇఫ్తార్' కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీక రంజాన్ మాసమని, రంజాన్ మాసంలో చేసే ఉపవాస దీక్ష ద్వారా మానసిక, శారీరక పవిత్రత చేకూరుతుందన్నారు. రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని, ఓర్పు, సహనం, ప్రతీ ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలన్నది రంజాన్ ఉపవాస దీక్షల ప్రధాన సందేశమన్నారు. సర్వమతాల సారం ఒక్కటేనని, ఉపవాస దీక్షలు, ఆరాధన ప్రార్థనలు మనుషుల్లో ప్రేమ, సోదరభావం, మానవత్వం వంటి సద్గుణాలను పెంపొందిస్తాయన్నారు. మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా ఉపవాస దీక్ష చేసిన చిన్నారులతో, ముస్లిం మత పెద్దలతో కలిసి 'ఇఫ్తార్' విందులో కలెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ కె.విజయరాజు, ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి ఎన్ఎస్.కృపావరం, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి, జిల్లా బిసి సంక్షేమాధికారి నాగరాణి, బిసి కార్పొరేషన్ ఇడి పుష్పలత, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ముక్కంటి, ఇరిగేషన్ శాఖ ఎస్ఇ పి.నాగార్జునరావు, వ్యవసాయ శాఖ జెడి హబీబ్ భాషా, సెట్ వెల్ మేనేజర్ ప్రభాకర్, ముస్లిం మతపెద్దలు, ప్రభృతులు పాల్గొన్నారు.

జీవశాస్త్రం పరీక్ష ప్రశాంతం

ముసునూరు: 10వ తరగతి పరీక్షలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, విద్యార్థులకు అంతరాయం లేకుండా ప్రశాంతంగా నిర్వహించాలని మండల రెవెన్యూ తహశీల్దార్ కె.రాజకుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని గోపవరం, చెక్కపల్లి, ముసునూరు పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి బివిఎస్.సుబ్బారావుతో మాట్లాడుతూ మూడు పరీక్ష కేంద్రాల నుంచి 12 మంది జీవశాస్త్రం పరీక్షకు గైర్హాజరైనట్లు తెలియజేశారు.

కలిదిండి : పదవ తరగతి బయోలాజికల్ సైన్స్ పరీక్షకు 935 మంది పరీక్ష రాయవలసి ఉండగా 913 మంది హాజరైనట్లు ఎంఇఒ. అల్లూరి రవి ప్రకాష్ తెలిపారు. మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాలలో బయోలాజికల్ సైన్స్ పరీక్ష జరుగగా 22 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు.

సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కెవిఎన్.నాగ ప్రభుకుమార్

నూజివీడు టౌన్ : సారా రహిత జిల్లాగా ఏలూరు జిల్లాను తీర్చిదిద్దడమే లక్ష్యం అని ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కెవిఎన్.నాగ ప్రభుకుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం నూజివీడు వచ్చిన సందర్భంగా మాట్లాడుతూ 2016, 2017లలో నవోదయం అనే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మళ్లీ ఈ ఏడాది నవోదయం 2.0 అనే కార్యక్రమాన్ని చేపట్టడం ద్వారా సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందడుగులు వేస్తున్నట్లు చెప్పారు. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలలో 145 గ్రామాలు సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించామన్నారు. అత్యంత సమస్యాత్మక గ్రామాలుగా 29 ఉండగా, బి గ్రేడ్‌లో 29 గ్రామాలు, సి గ్రేడ్‌లో 75 గ్రామాలు ఉన్నట్లు చెప్పారు. ఏలూరు జిల్లా పరిధిలో తోటలు, కొండలు, గుట్టలు, గిరిజన ప్రాంతాలు ఏస్తారంగా వ్యాపించి ఉండడం వల్ల సారా తయారీదారులకు అనుకూలంగా మారిందని వివరించారు. ఆయా ప్రాంతాలలో సారా తయారీ, విక్రయాలలో తాము తీసుకుంటే చర్యలను వివరిస్తున్నట్లు చెప్పారు. నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య పాల్గొన్నారు.

చిన వెంకన్న హుండీ ఆదాయం రూ.86,52,879

ద్వారకాతిరుమల : శ్రీవెంకటేశ్వరస్వామి వారి హుండీ లెక్కింపు శు క్రవారం ఉదయం ప్రమోద కళ్యాణ మండప ఆవరణలో దేవాలయ ఈఒ సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో భారీ భద్రతా ఏర్పాట్ల నడుమ దేవాలయ సిబ్బంది హుండీల లెక్కింపు నిర్వహించారు. గడచిన 11 రోజులకు గాను జరిగిన ఈ హుండీ లెక్కింపులో శ్రీవారికి నగదు రూపేణ రూ.86 లక్షల 52 వేల 879 ఆదాయం లభించినట్లు ఆలయ ఇఒ సత్యనారాయణ మూర్తి తెలిపారు. అలాగే భక్తులు సమర్పించిన కానుకల రూపేనా 103 గ్రాముల బంగారం, 2-075 కేజీల వెండి లభించినట్లు ఇఒ పేర్కొన్నారు. పాత నోట్లు 500(1), 1000(4), 2000(12), అలాగే 9 విదేశీ కరెన్సీ సైతం లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, ఆలయ సిబ్బంది, భక్తులు, సేవకులు పాల్గొన్నారు.

పోరాటాల వల్లే భూసంస్కరణల చట్టం

సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

చింతలపూడి : భారతదేశంలో బ్యాంకుల జాతీయకరణకు భూసంస్కరణల చట్టం తీసుకురావడంలో సిపిఐ విశేషంగా పోరాడిందని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. మార్చి 23 భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా దేశవ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రచార యాత్ర శుక్రవారంలో ప్రవేశించి మల్లేశ్వరం, ఎండపల్లి, రాఘవపురం, గణిజర్ల మీదుగా చింతలపూడి చేరింది. శుక్రవారం ఉదయం చింతలపూడి పాత బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ప్రారంభమైన ప్రచార యాత్ర పట్టణంలో బోసు బొమ్మ సెంటర్, ఫైర్ స్టేషన్ సెంటర్ మీదుగా రేచర్ల, ఎర్రగుంటపల్లి, మల్లాయగూడెం, సమ్మెటవారిగూడెం మీదుగా పాత చింతలపూడిలో ముగిసింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచార కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. భారతదేశంలో బ్యాంకుల జాతీయకరణకు, భూసంస్కరణల చట్టం తీసుకురావడంలో సిపిఐ విశేషంగా పోరాడిందని, భూసంస్కరణల చట్టం ద్వారా మిగులు భూములు లక్షలది ఎకరాలు పేదలకు సాగుభూములుగా, ఇళ్ల స్థలాలుగా సాధించిన ఘనత సిపిఐకే ఉందని తెలిపారు. ఈ ప్రచార జాతాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచే వసంతరావు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సెంబర్ నాగం అచ్యుత్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.శివకుమార్ పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్వ్యూలు

చాట్రాయి : స్వయం ఉపాధికి కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందుటకు బిసి, ఒసి కాపు, ఇడబ్ల్యుఎస్ దరఖాస్తుదారులకు శుక్రవారం చాట్రాయి మండల ప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం దరఖాస్తుదారులు 840 మంది కాగా 702 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపిడిఒ విజయకుమార్ తెలిపారు.

రైలు కింద పడి వృద్ధుని ఆత్మహత్య

ఏలూరు స్పోర్ట్స్ : ఒకవైపు భార్య చనిపోయిందన్న బాధ, మరోవైపు ఒంటరిగా ఉంటున్నాననే బాధ అతనిని కృంగదీసింది. దీంతో వృద్ధుడు రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఏలూరు నగరంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్ తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని లంకపేట ప్రాంతానికి చెందిన పిల్లి గురుమూర్తి(77) ఆరేళ్ల క్రితం భార్య చనిపోవడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. ఒకవైపు ఒంటరిగా జీవించడం, మరోవైపు భార్య చనిపోయింది అన్న బాధ అతను జీర్ణించుకోలేకపోయాడు. బుధవారం ఆత్మహత్య చేసుకుందామనే ఉద్దేశంతో ఏలూరు నగరంలోని పెద్ద రైల్వే స్టేషన్ రెండో ప్లాట్‌ఫారం సమీపంలో గుర్తుతెలియని రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా విక్రేతపై కేసు నమోదు

నూజివీడు టౌన్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నవోదయం 2.0 అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఒగిరాల తండా గ్రామంలో జరిపిన దాడులలో 1000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 35 లీటర్ల నాటుసారాయిని స్వాధీనం చేసుకుని, వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.పాండు రంగారావు తెలిపారు. నేరస్థలం నుంచి పారిపోయిన మూడు కృష్ణ అలియాస్ చిన్నకృష్ణ, తండ్రి గాంధీ అను అతనిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడులలో ఇఎస్‌టిఆఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ కెఎండి ఆరిఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి తక్షణ చర్యలు

ప్రజాదర్బార్‌లో 174 అర్జీలు స్వీకరణ

రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి క్యాంప్ ఆఫీసులో శుక్రవారం నిర్వహించిన మెగా ప్రజా దర్బార్‌కు విశేష స్పందన లభించింది. ప్రజా దర్బార్ కార్యక్రమంలో 174 అర్జీలు రాగా వాటిలో అధికంగా రెవెన్యూ, సివిల్, రైసు కార్డులు, భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, అర్జీలను స్వయంగా స్వీకరించి తక్షణం పరిష్కార చర్యలు చేపడతామని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉదయం 10 గంటలకు మొదలై సాయంత్రం 6 గంటల వరకూ నిర్వహించారు. నూజివీడు నియోజకవర్గంలో అన్ని మండలాల ప్రజల శ్రేయస్సు, మెరుగైన సేవలు అందించడం కోసం చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు అందరూ పాల్గొని ఎవరి బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహించి, విజయవంతం చేసారని వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఇకనుంచి ప్రతీ నెలా ప్రజా దర్బార్ నిర్వహిస్తామని, ప్రజా దర్బార్ నుంచి స్వీకరించిన అర్జీలు, ప్రజల నుంచి వచ్చిన ఎలాంటి సమస్యనైన ఓర్పు, సహనంతో జాగ్రత్తగా పరిశీలించి అధికారులతో చర్చించి, తక్షణ చర్యలు చేపట్టాలని కూటమి నాయకులకు సూచించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నేను పదవి చేపట్టిన రోజునుంచి నూజివీడు నియోజక వర్గంలో ప్రజలు అనేక దీర్ఘకాలిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని గమనించానని, ముఖ్యంగా ల్యాండ్, రెవెన్యూ, సివిల్, ఫారెస్ట్, విద్యుత్, ఇతర సమస్యలు నాదృష్టికి వచ్చాయని, దానికి పూర్తి పరిష్కార మార్గం చేపట్టాలనే ఆలోచనతో ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేశామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన అధికారులు, నాయకులు ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి, బాధ్యతగా ప్రజా సమస్యలు పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. రానున్న 5 సంవత్సరాల్లో ప్రజల నుంచి ఎలాంటి సమస్య వచ్చినా తక్షణమే పరిష్కరించే బాధ్యత నాది అని మంత్రి తెలిపారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రభుత్వ అధికారులందరూ పాల్గొన్నారు.

అర్జీలు పరిశీలిస్తున్న మంత్రి

పదవి అంటే బాధ్యత

ఎంఎల్ఎ చింతమనేని

దెందులూరు : పదవి అంటే అలంకారం కాదని, ప్రజల పట్ల మనకు పెరిగిన బాధ్యతగా భావించాలని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. ఏలూరు రూరల్ మండలం వైస్ ఎంపిపిగా ఎన్నికైన గండికోట నాగరాజు శు క్రవారం ఉదయం దుగ్గిరాల లోని క్యాంపు కార్యాలయంలో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకరిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా నూతనంగా వైస్ ఎంపిపిగా ఎన్నికైన గండికోట నాగరాజును ఎంఎల్ఎ చింతమనేని అభినందించారు. ఏలూరు రూరల్ మండల అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు రూరల్ మండలం టిడిపి అధ్యక్షులు నంబూరి నాగరాజు, ఇన్‌స్పెక్టర్ ఇన్‌ఛార్జి నేతల రవి, కొల్లేటి సంఘం అధ్యక్షులు సైదు సత్యనారాయణ, కూటమి నాయకులు జమలయ్య సహా పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకం దరఖాస్తుదారులతో ముఖాముఖి

భీమడోలు : స్వయం ఉపాధి పొందాలని 2024-25 పథకము కింద స్వయం ఉపాధి రుణాల కోసం మండలం నుంచి బిసి, ఇబిసి, కాపు కార్పొరేషన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ముఖాముఖి కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి పద్మావతి దేవి తెలిపారు. దీనిలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం వేదికగా రెండు విడతలుగా ముఖాముఖి కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. తొలి విడతగా శుక్రవారం కార్యక్రమం ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా చేపట్టిన కార్యక్రమానికి భీమడోలు గ్రామపంచాయతీ నుంచి 609 మంది, అంబరు పేట గ్రామపంచాయతీ నుంచి 212 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. మండలం మొత్తంగా 1608 దరఖాస్తులు వచ్చాయన్నారు. భీమడోలు, అంబరుపేట పోను మిగిలిన గ్రామ పంచాయతీలకు భీమడోలు ఎంపిడిఒ కార్యాలయం వేదికగా ఏప్రియల్ మూడవ తేదీన ముఖాముఖి నిర్వహించనున్నామని తెలిపారు.

వైసిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ సంయుక్త కార్యదర్శిగా రాంబాబు

ప్రజాశక్తి - ముసునూరు

రాంబాబు

వైసిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ సంయుక్త కార్యదర్శిగా కంబాల రాంబాబు నియమితులయ్యారు. మండలం లోని కాట్రేనిపాడు గ్రామానికి చెందిన వైసిపి గ్రామ అధ్యక్షులు కంబాల రాంబాబుకు వైసిపి ఎస్‌సి సెల్ సంయుక్త కార్యదర్శిగా పదవి రావడంతో వైసిపి మాజీ ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు, వైసిపి మండల నాయకులు కోటగిరి రాజానాయన, బి.నరసింహారావు, చిలుకూరి శ్రీనివాసరావు, కాటేపల్లి రమేష్, జెడ్‌పిటిసి ప్రతాప్, ఎంపిపి కొండా దుర్గాభవాని, పార్టీ మండల అధ్యక్షుడు ఎం.నాగమల్లేశ్వరరావు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కంబాల రాంబాబు మాట్లాడుతూ పార్టీకి పలు సేవలు అందిస్తూ, పార్టీని బలోపేతం చేసేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

ప్రతిఒక్కరూ ఫ్రైడే డ్రై డే పాటించాలి

జిల్లా మలేరియా అధికారి పివిఎస్.ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

దోమల వృద్ధిని అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ ఫ్రైడే డ్రైడే ఆచరించాలని అప్పుడే దోమల ద్వారా వచ్చే అంటువ్యాధుల నుంచి కొంత వరకు తప్పించుకోవచ్చని జిల్లా మలేరియా అధికారి పివిఎస్.ప్రసాద్ సూచించారు. స్థానిక ఏలూరు పట్టణ ఆరోగ్య కేంద్రం తంగెళ్లమూడి, ఎంఆర్‌సి కాలనీ, సచివాలయ పరిధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శు క్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ మాట్లాడుతూ అపరిశుభ్ర పరిసరాల వల్ల దోమలు ఎక్కువగా వృద్ధి చెంది తద్వారా ప్రాణాంతక వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్ గునియా మొదలగు వ్యాధులు సంభవించే అవకాశం ఉందని తెలిపారు. దోమకాటు కంటికి కనిపించదని, కానీ దాని ద్వారా ముప్పు చాలా ఉంది కాబట్టి ప్రజలు దోమల నిర్మూలలో భాగస్వామ్యం కావాలని సూచించారు. వారానికి ఒకసారి అయినా నీళ్ల తొట్లను ఖాళీ చేసి భ్రమరకాని మూతలు పెట్టుకోవాలని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఇంజిన్ ఆయిల్ చల్లాలని, సాయంత్రం సమయంలో కిటికీలు వేసుకుని దోమతెరలు వాడాలని, వేపాకు పొగ ఇంట్లో వేసుకోవాలని సూచించారు. ప్రజలు మురికి కాలువల్లో చెత్త వేయకుండా ఉండాలని, మనకి హాని చేసే దోమలు నీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయని కాబట్టి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఆంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు హ్యాండ్ వాష్ ఎలా చేసుకోవాలో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో యుపిహెచ్‌సి తంగెళ్లమూడి వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున్, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్

వైసిపి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు

ప్రజాశక్తి - చింతలపూడి

రంజాన్ పండుగ మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని వైసిపి నియోజకవర్గం కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. మండలంలోని చింతలపూడి పట్టణంలో పెద్ద మసీదు ముస్లిం సహోదరులతో కలసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఫ్తార్ విందుకు ఆహ్వానించడం సంతోషంగా ఉందని, ముస్లింల సంక్షేమానికి జగన్మోహన్ రెడ్డి కృషి చేశారని తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో పాటించే ఉపవాస దీక్షలు ఎంతో భక్తిశ్రద్ధలతో పాటిస్తారని, అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ అందరికీ ఉండాలని కోరారు. పవిత్ర మాసంలో చిన్నపిల్లల నుంచి మొదలుకొని వృద్ధుల వరకు కఠోర నియమాలతో ఉపవాస దీక్షలు చేయడం గొప్ప విషయమన్నారు. రంజాన్ మాసం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఇఫ్తార్ విందులతో సోదర భావం పెంపొంది, ప్రజల మధ్య ఐక్యత పెరుగుతుందన్నారు. అల్లా ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, ముస్లిం సహోదరులు పాల్గొన్నారు.



మంత్రికి ఆహ్వాన పత్రాన్ని అందజేసిన తానా ప్రతినిధులు

తానా మహాసభకు మంత్రి పార్థసారధికి ఆహ్వానం

ప్రజాశక్తి - నూజివీడుటౌన్

ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) మహాసభలకు రావాల్సిందిగా తానా ప్రతినిధులు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధిని ఆహ్వానించారు. శుక్రవారం వారు మంత్రి పార్థసారధిని కలిసి ఈ ఏడాది జూలై 3 నుంచి 5 వరకు అమెరికాలోని డెట్రాయిట్‌లో జరిగే తానా మహాసభల ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. తానా ఛైర్మన్ గంగాధర్ నాదెళ్ల, తానా కాన్ఫరెన్స్ డైరెక్టర్ సునీల్, మాజీ అధ్యక్షుడు జయరాం కోమటి పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శన



స్టీల్ కాన్‌లు అందజేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని తకెళ్లపాడు గ్రామంలో శు క్రవారం ఉదయం పశుసంవర్ధక శాఖ, జిల్లా పశు గణనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 25 గేదె దూడలు, 15 ఆవు దూడలను పాడి రైతులు తీసుకువచ్చారు. తదుపరి కార్యక్రమాన్ని ఉద్దేశించి భీమడోలు ఎడి డాక్టర్ సాయి రమేష్ పాడి రైతులకు లేగ దూడలు పశుపోషణలో మెళుకువలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశువు జీవిత కాలంలో ఒకసారి వేసే బ్రూసెల్ల టీకాలను 4-6 నెలల వయసు ఉన్న 30 పెయ్యి దూడలకు వేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో పశు పోషణ, జాతి లక్షణాలు ఆధారంగా 1, 2 ,3 బహుమతులు రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో లేగదూడలు తీసుకు వచ్చిన ప్రతీ పాడి రైతుకు కాల్షియం, లివర్ టానిక్, గోమర్లు మందు, స్టీల్ కాన్‌లు ఉచితం అందజేశారు. ఈ కార్యక్రమంలో ద్వారకాతిరుమల మండల పశువైద్య అధికారి డాక్టర్ అంగర సురేష్, పూళ్ల పశువైద్య అధికారి డాక్టర్ హరికృష్ణ, గ్రామ పాడి రైతులు బొల్లా రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, మానికల రామకృష్ణ, ముల్లంగి కృష్ణా రెడ్డి, షేక్ మస్తాన్ సాహెబ్ పాల్గొన్నారు.

నేడు ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ

నూజివీడు టౌన్ : అన్నగారి విగ్రహావిష్కరణ పండుగను విజయవంతం చేయాలని మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి ఎన్‌టి.రామారావు విగ్రహావిష్కరణ వేడుకకు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. టిడిపి వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకొని టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు కాంస్య విగ్రహాన్ని నూజివీడు పట్టణంలో పోతిరెడ్డిపల్లి గ్రామం వెళ్లే సెంటర్లో ఏర్పాటు చేయడం జరిగింది. శనివారం సాయంత్రం 4 గంటలకు విగ్రహావిష్కరణ అనంతరం ఎఎంసి మార్కెట్ యార్డులో భారీ బహిరంగ సభ అనంతరం నియోజకవర్గ టిడిపి కుటుంబ సభ్యులందరికీ తేనేటి విందు ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని సమన్వయంతో కలిసి పనిచేసి విజయవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. విగ్రహ ఏర్పాట్లు, భారీ సభ ఏర్పాట్లు పరిశీలించి నాయకులకు దిశా నిర్దేశం చేశారు.

పోక్సో చట్టంపై అవగాహన

ముసునూరు : బాలికలందరూ మంచిగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా జడ్జి నాగ శైలజ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మండల కేంద్రమైన ముసునూరు గురుకుల బాలికల పాఠశాలలో పోక్సో చట్టం గురించి అవగాహనా సదస్సులో జిల్లా జడ్జి నాగ శైలజ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా తోటి విద్యార్థులతో ఎల్లప్పుడూ స్నేహభావం, సేవా ధృక్పథంతో ఉండాలన్నారు. వ్యక్తిగత ద్వేషాలు, పరస్పర ఘర్షణలకు పాల్పడరాదని, ఉపాధ్యాయులను ఎలా గౌరవిస్తున్నారో అదేవిధంగా విద్యార్థులను కూడా గౌరవించుకోవాలని ఒకరికి ఒకరు తోడుండే విధంగా స్నేహభావం ఆ పాఠశాల వాతావరణంలో ఉండాలని ఉపాధ్యాయులకు కూడా సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.ప్రవీణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE AGENT TO GOVERNMENT (DISTRICT COLLECTOR) BHADRADRI KOTHAGUDEM DISTRICT
M.O.P.No. 67/2024

బిట్వీన్ :
పెద్దాడ సాయికృష్ణ కాంత్ ......పిటీషనర్
మరియు :
పెద్దాడ ఉషారాణి అలియాస్ సిరిగినీడి ఉషారాణి .....రెస్పాండెంట్

టు
పెద్దాడ ఉషారాణి అలియాస్ సిరిగినిడి ఉషారాణి, భర్త: సాయికృష్ణ కాంత్, వయస్సు: 26సం॥లు, వృత్తి: గృహిణి, నివాసం: ఇంటి నెం.3-3-21, నియర్, జగన్నాధస్వామి టెంపుల్, రుస్తుంవాడ, వేవర్స్ కాలనీ, వార్డు నెం.13, నర్సాపురం గ్రామం మరియు ముండలం, పశ్చిమగోదావరి జిల్లా.

నోటీసులు

పైన తెలిపిన కేసులో పిటీషనరు మీ నుండి విడాకులు కోరుతూ మీపై హిందు వివాహ చట్టం ప్రకారం కేసు దాఖలు చేసినారు. అట్టి కేసులో మీకు ఎన్నిపర్యాయములు కోర్టు ద్వారా నోటీసులు పంపినను మీరు తీసుకొనకుండా కావాలని తప్పించుకొని తిరుగుచున్నారు. ఇట్టి కేసులో మీ హాజరు నిమిత్తం **తేది:11-04-2025న ఉదయం10-30గం॥లకు** గౌ॥ కోర్టు వారు వాయిదా వేసియున్నారు. ఆ రోజున మీరు స్వయముగా గానీ, మీ న్యాయవాది కానీ హాజరై మీ సమాధానం తెలుపుకొనగలరు. అట్లు మీరు హాజరుకాని పక్షంలో కోర్టు వారు మీ పరోక్షమున తీర్పు ఇవ్వగలరు.

వాయిదా: 11-04-2025
//కోర్టు వారి ఆదేశాల మేరకు//
జనపరెడ్డి గోపీకృష్ణ,
కొత్తగూడెం న్యాయవాది
21-03-2025 కొత్తగూడెం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

పాలకొల్లు పురపాలక సంఘం

ఆర్.ఓ.సి. నెం. 200/2025/ఇ1 ది.28-03-2025

ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు

పాలకొల్లు పురపాలక సంఘ పరిధిలోని (1) 21వ వార్డులో ఆసుపత్రి ఏరియా నందు అప్రోచ్ CC రోడ్డును ఏర్పాటు చేయుటకు (2) 3వ వార్డు హెడ్ వాటర్ వర్క్స్ నందు గల బాలెన్స్ Clarifioculator Bridge ఏర్పాటు చేయుటకు (3) వీధి దీపముల రిపేర్లు మరియు నిర్వహణ మున్సిపల్ ఆఫీసు, మున్సిపల్ బిల్డింగ్స్ నందు ఎలక్ట్రికల్ రిపేర్లు కొరకు అవుట్ సోర్సింగ్ (టెక్నికల్) సిబ్బంది సరఫరా కొరకు నిమిత్తం (4) 27వ వార్డులోని అంబేద్కర్ భవనం నందు 125 KVA డీజిల్ జనరేటర్ సెట్ సప్లయ్, డెలివరి మరియు installation చేయు నిమిత్తం (4 పనులకు) గాను అంచనాలు విలువ సుమారు రూ. 1,05,66,000/- లతో ఇ-ప్రొక్యూర్ మెంటు ద్వారా షార్టు టెండర్లు కోరడమైనది. టెండరు షెడ్యూలు ఇ-ప్రొక్యూర్ మెంటు మార్కెట్ నందు ది. **29-03-2025వ తేది సాయంత్రం గం. 4-00 ని.ల** నుండి లభించును. మిగిలిన వివరములు ఇ-ప్రొక్యూర్ మెంటు మార్కెటు www.tender.apeprocurement.gov.in లేదా కమిషనరు, పాలకొల్లు పురపాలక సంఘము, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా వారిని సంప్రదించగలరు.

కమీషనరు,
పాలకొల్లు పురపాలక సంఘం

వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

సర్వసభ్య సమావేశంలో జెడ్‌పిటిసి సూరిబాబు

ప్రజాశక్తి - టి.నరసాపురం

వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు(సూరిబాబు) ఆదేశిం చారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి దారబోయిన లక్ష్మి అధ్యక్షతన మండల స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ గ్రామస్థాయిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు జాగ్రత్తలు వహించాలన్నారు. మండలంలో పాడైన చేతిపంపులు గుర్తించి మరమ్మతులు చేయించాలన్నారు. మండలంలో ఉపాధి కూలీలకు ఉపాధి పనులు కల్పించాలన్నారు. త్వరితగతిన మేట్‌లను నియమించాలన్నారు. గండిగూడెం, బొర్రంపాలెం, టి.నరసాపురం పాఠశాలల్లో ప్రమాదకరంగా ఉన్న ఇంకుడు గుంతలు వెంటనే పూడ్చించాలని హెచ్చరించారు. ఎస్‌సి, ఎస్‌టి కాలనీల్లో 3 నుంచి 20 సెంట్ల స్థలం ఉంటే ఉచితంగా ప్రభుత్వం సోలార్ విద్యుత్ అందిస్తుందన్నారు. హౌసింగ్ పథకం ద్వారా ఇళ్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం రూ.లక్షా 80తో పాటు అదనంగా ఎస్‌సిలకు రూ.50 వేలు, ఎస్‌టిలకు రూ.70 వేలు, కొండల్లో ఉండే గిరిజనులకు రూ.లక్ష మంజూరు చేస్తుందని, లబ్ధిదారులు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దారబోయిన లక్ష్మి, ఎంపిడిఒ జి.మణి కుమారి, తహశీల్దార్ టి.సాయిబాబా, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జర్నలిస్టుపై దాడి దారుణం

ప్రజాశక్తి - పోలవరం

కైకలూరుకు చెందిన న్యూస్ రైట్ పత్రిక ఎడిటర్ కురెళ్ల కిషోర్‌పై జరిగిన దాడి దారుణమని, దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని పోలవరం ప్రెస్ క్లబ్ సమావేశం డిమాండ్ చేసింది. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సొబ్బన రాజశేఖర్ బాబు అధ్యక్షతన శుక్రవారం పోలవరం ప్రెస్ క్లబ్ కార్యాలయంలో సమావేశం జరిగింది. కైకలూరు మండలంలో వైస్ ఎంపీపీ ఎన్నిక ఉద్రిక్త పరిస్థితులకి దారితీసిందని తెలుసుకున్న న్యూస్ రైట్ పత్రిక ఎడిటర్ కురెళ్ల కిషోర్ ఆ సంఘటనను చిత్రీకరిస్తున్న సమయంలో కూటమికి చెందిన దాదాపు 30 మంది అతనిపై విచక్షణారహితంగా దాడి చేసి, గాయపరిచారని సొబ్బన రాజశేఖర్ బాబు అన్నారు. వార్త కవరేజ్ చేస్తున్న జర్నలిస్టుపై కూటమి నాయకులు విచక్షణారహితంగా దాడి చేయడం అమానుషం అన్నారు. దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పోలవరం ప్రెస్ క్లబ్ డిమాండ్ చేసింది. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేవారు ఎలాంటి వారైనా ప్రజా కోర్టులో నిలబడాల్సిందేనని హెచ్చరించింది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కాపాడి పత్రికా స్వేచ్ఛకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దొడ్డి సుధాకర్ రాజు, తాళ్లపూడి లక్ష్మణరావు, కందుల రామ సూర్య చంద్రరావు(రాము), కుంజం రాంబాబు, జయవరపు ఆదిశేషు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

గ్రామపంచాయితీ కార్యాలయం - పాలమూరు
పెనుమంట్ర మండలం.

రి.క.నెం. /2025 **టెండర్ నోటీసు** 29/03/2025

పశ్చిమ గోదావరి జిల్లా, పెనుమంట్ర మండలం, **పాలమూరు గ్రామ పంచాయితీకి** 2025-2026 సం॥నకు ఈ క్రింది తెల్పిన ప్రకారం **ది.01-4-2025 తేదీ నుండి 31-03-2026వ తేది వరకు,** అనగా ఒక సంవత్సరంనకు కాలపరిమితి కాంట్రాక్టు పద్ధతిపై సేవలు అందజేయుటకు మరియు ఈ దిగువ అయిటెంలకు సంబంధించి సామానులు సరఫరా చేయు నిమిత్తం, టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లను **ది.08-04-2025 మంగళవారం ఉదయం 11.00 నుండి మధ్యాహ్నం 3.00 గంటల వరకు** తీసుకోబడి, అదే రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షంలో టెండర్లు తెరవబడును. అర్హత కలిగిన వ్యక్తులు ఏజెన్సీల టెండర్లు, నిబంధనలను అంగీకరించి, తమ టెండరు దరఖాస్తులను సమర్పించవలెను. పూర్తి ఇతర వివరములు కోరు వారు గ్రామపంచాయితీ కార్యాలయం పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	షెడ్యూలు వివరములు	చెల్లించవలసిన ధరావత్తు ఒక్కంటికి
1.	పారిశుద్ధ్య నిర్వహణ - 4 గురు	రూ.50/- లు చొ॥న
2.	ఏజెన్సీ ద్వారా పారిశుద్ధ్య నిర్వహణ - 1 ఏజెన్సీ	రూ.50/- లు చొ॥న
3.	మంచినీటి సరఫరా నిర్వహణ పథకం ట్యాంకు ఆపరేటర్ - 3 గురు	రూ.50/- లు చొ॥న
4.	వీధి దీపముల రిపేరు పనులు - ఎలక్ట్రీషియన్-1	రూ.50/- లు చొ॥న
5.	2025-26 సం॥నకు గాను పంచాయితీకి అవసరమైన వీధి దీపములకు ఎల్.ఇ.డి సెట్స్/ఎల్.ఇ.డి. స్పేర్‌పార్ట్స్ తదితర సామానులు సరఫరా చేయుటకు.	రూ.100/- లు చొ॥న
6.	2025-26 సం॥నకు గాను పంచాయితీకి అవసరమైన పారిశుద్ధ్య సామానులు సరఫరా చేయుటకు.	రూ.100/- లు చొ॥న
7.	2025-26 సం॥నకు గాను పంచాయితీకి అవసరమైన వీధి వాటర్ వర్క్స్ సామానులు, చేతి పంపుల వీడి భాగములు సరఫరా చేయుటకు	రూ.100/- లు చొ॥న
8.	2025-26 సం॥గాను పంచాయితీకి అవసరమైన స్టేషనరీ సామానులు సరఫరా చేయుటకు	రూ.100/- లు చొ॥న
9.	2025-26 సం॥గాను పంచాయితీకి అవసరమైన పారిశుద్ధ్య సిబ్బందికి వాటర్ వర్క్స్ సిబ్బందికి, అటెండర్‌కు బట్టలు, చెప్పులు, జోళ్ళు, కొబ్బరి నూనె, సబ్బులు సరఫరా చేయుటకు	రూ.100/- లు చొ॥న

నోట్ : పై 5 నుంచి 9 అయిటమ్స్ సప్లయ్‌దారులకు గ్రామ పంచాయితీ విధుల నిర్వలను బట్టి చెల్లింపులు జరుగును.

సం/- కాకర రాజేశ్వరరావు, సర్పంచ్, గ్రామ పంచాయితీ, పాలమూరు, పశ్చిమ గోదావరి జిల్లా.
సం/- కావాడి సత్యనారాయణ, కార్యదర్శి, గ్రామ పంచాయితీ, పాలమూరు, పశ్చిమ గోదావరి జిల్లా.

గ్రామపంచాయితీ కార్యాలయం - మార్టేరు
పెనుమంట్ర మండలం.

రి.క.నెం. /2025 **టెండర్ నోటీసు** 29/03/2025

పశ్చిమ గోదావరి జిల్లా, పెనుమంట్ర మండలం, **మార్టేరు గ్రామ పంచాయితీకి** 2025-2026 సం॥నకు ఈ క్రింది తెల్పిన ప్రకారం **ది.01-4-2025 తేదీ నుండి 31-03-2026వ తేది వరకు,** అనగా ఒక సంవత్సరంనకు కాలపరిమితి కాంట్రాక్టు పద్ధతిపై సేవలు అందజేయుటకు మరియు ఈ దిగువ అయిటెంలకు సంబంధించి సామానులు సరఫరా చేయు నిమిత్తం, టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లను **ది.07-04-2025 సోమవారం ఉదయం 11.00 నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు** తీసుకోబడి, అదే రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షంలో టెండర్లు తెరవబడును. అర్హత కలిగిన వ్యక్తులు ఏజెన్సీల టెండర్లు, నిబంధనలను అంగీకరించి, తమ టెండరు దరఖాస్తులను సమర్పించవలెను. పూర్తి ఇతర వివరములు కోరు వారు గ్రామపంచాయితీ కార్యాలయం పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	షెడ్యూలు వివరములు	చెల్లించవలసిన ధరావత్తు ఒక్కంటికి
1.	పారిశుద్ధ్య నిర్వహణ - 12 మంది	రూ.50/- లు చొ॥న
2.	మంచినీటి సరఫరా నిర్వహణ - 2	రూ.50/- లు చొ॥న
3.	వీధి దీపముల రిపేరు పనులు - ఎలక్ట్రీషియన్-1	రూ.50/- లు చొ॥న
4.	2025-26 సం॥నకు గాను పంచాయితీకి అవసరమైన వీధి దీపములకు ఎల్.ఇ.డి సెట్స్/ఎల్.ఇ.డి. స్పేర్‌పార్ట్స్ తదితర సామానులు సరఫరా చేయుటకు.	రూ.100/- లు చొ॥న
5.	2025-26 సం॥నకు గాను పంచాయితీకి అవసరమైన పారిశుద్ధ్య సామానులు సరఫరా చేయుటకు.	రూ.100/- లు చొ॥న
6.	2025-26 సం॥నకు గాను పంచాయితీకి అవసరమైన వీధి వాటర్ వర్క్స్ సామానులు, చేతి పంపుల వీడి భాగములు సరఫరా చేయుటకు	రూ.100/- లు చొ॥న
7.	2025-26 సం॥గాను పంచాయితీకి అవసరమైన స్టేషనరీ సామానులు సరఫరా చేయుటకు	రూ.100/- లు చొ॥న
8.	2025-26 సం॥గాను పంచాయితీకి అవసరమైన పారిశుద్ధ్య సిబ్బందికి వాటర్ వర్క్స్ సిబ్బందికి, అటెండర్‌కు బట్టలు, చెప్పులు, జోళ్ళు, కొబ్బరి నూనె, సబ్బులు సరఫరా చేయుటకు	రూ.100/- లు చొ॥న

నోట్ : పై 4 నుంచి 8 అయిటమ్స్ సప్లయ్‌దారులకు గ్రామ పంచాయితీ విధుల నిర్వలను బట్టి చెల్లింపులు జరుగును.

సం/- మట్టా కుమారి రాము, సర్పంచ్, గ్రామ పంచాయితీ, మార్టేరు, పశ్చిమ గోదావరి జిల్లా.
సం/- కావాడి సత్యనారాయణ, కార్యదర్శి, గ్రామ పంచాయితీ, మార్టేరు, పశ్చిమ గోదావరి జిల్లా.